ప్రతి ఇంటికీ తాగునీరు

- శివారు కాలనీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- జలమండలి ఎండీపై ఒత్తిడి తెచ్చి నిధుల మంజూరు
- రూ. 1.50 కోట్ల వ్యయంతో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు
- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


కొలను శివారెడ్డినగర్‌లో పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించి, ప్రత్యేక దృష్టితో శివారు కాలనీలను అభివృద్ధి చేస్తున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మన్సూరాబాద్ హయత్‌నగర్‌లోని పలుకాలనీలలో రూ. 1.50 కోట్ల వ్యయంతో చేపడుతున్న తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి మాట్లాడుతూ... జలమండలి ఎండీపై ఒత్తిడి పెంచి ఒప్పించి నియోజకవర్గంలో 66 కిలోమీటర్ల మేర నూతన మంచినీటి పైప్‌లైన్ పనులకు నిధులను మంజూరు చేయించామని తెలిపారు.

- మన్సూరాబాద్ డివిజన్‌లో సుమారు 16 కిలో మీటర్ల మేర పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.
- మంచినీటి సౌకర్యం, డ్రైనేజీ వసతి అనంతరం సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలన్నింటినీ దశల వారీగా పరిష్కరించినట్లు స్పష్టం చేశారు. రోజూ ఒక కాలనీలో మంచి నీటి పైప్‌లైన్ పనులు పూర్తయ్యేలా పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతున్నట్లు దేవిరెడ్డి అన్నారు.
- కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కి డి మల్లారెడ్డి, నాయకులు పోచబోయిన జగదీష్‌యాదవ్, టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి, నాంపల్లి రామేశ్వర్, పాతూరి శ్రీధర్‌గౌడ్, సబితారెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, ఎంజాల జగన్ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు కొలను నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల సత్యం, మాన్యానాయక్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రెయిన్‌బజార్ చమన్, గాంధీకా పుత్లా, మస్కతీ పార్క్, డక్కన్ ఫంక్షన్‌హాల్, కుమ్మరవాడి, జ్యోతిబాగ్, రజానగర్, రెయిన్‌బజార్, శ్రీనగర్‌కాలనీ, నెహ్రూనగర్, రామచంద్రానగర్, దరాబ్ జంగ్ కాలనీ, క్రీడా లేన్, హబీబ్‌నగర్ క్రాస్‌రోడ్స్, కమ్యూనిటీహాల్, ఇంద్రానగర్, రియాసత్‌నగర్, రాజనర్సింహానగర్, పిసల్‌బండ చౌరస్తా, రవూఫ్‌నగర్, జమాల్‌కాలనీ, అబుబకర్ మాస్క్, మోయిన్‌బాగ్, చిల్డ్రన్ జైల్, రక్షాపురం టింబర్ డిపో, అక్తర్ పీటీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జయానగర్, సైదాబాద్ 2ఆర్‌టీ, తిరుమల మెడికల్‌హాల్, వంశీ అపార్ట్స్, వెంగళరావ్ పీటీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలివేస్తామని తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బిలాల్ మసీద్, మాధవినగర్, ఎల్ఐసీ కాలనీ, ముంతాజ్ కాలనీ, డ్రీంపాయింట్, సైదాబాద్ కమ్యూనిటీ హాల్, సైదాబాద్ కాలనీ, సైదాబాద్ పోలీస్‌స్టేషన్, ఫరాత్ కాలనీ, సపోటాబాగ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ వివరించారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 15, వంకాయ 23, బెండ 55, పచ్చి మిర్చి 35, కాకర 40, బీర 35, క్యాబేజి 9, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 20, దొండ 25–35, చిక్కుడు 50, గోకర 40, బీట్‌రూట్ 15, క్యాప్సికం 40, ఆలు 22, దోస 26, సొర 13, పొట్ల 18, ఉల్లి 17, చామగడ్డ 70 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నియామకం


కలకోట్ల రమేష్

మలక్‌పేట: జైభీమ్ జైమీమ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభివృద్ధి సేవా సమితి గ్రేటర్ కార్యదర్శిగా మూసారంబాగ్ శాలివాహననగర్‌కు చెందిన కలకోట్ల రమేష్ నియమితులయ్యారు. ఇందుకు సంబంధించి నియామకపత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు శేగ్యారీ శ్రీనివాస్ ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ... దళిత, గిరిజన, మైనార్టీ వర్గాల అభ్యున్నతి కోసం పని చేస్తానన్నారు. గ్రేటర్ అధ్యక్షుడు ఎడవల్లి నర్సింహ్మా, ప్రధాన కార్యదర్శి అంబారి పవన్, పి.రాంచందర్, లక్ష్మి, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న రామ్మోహన్‌గౌడ్

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి డివిజన్ సాహెబ్‌నగర్‌లోని శ్రీ పోచమ్మ, ఎల్లమ్మ అమ్మవారికి మంగళవారం ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి ముద్దగొని రామ్మోహన్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శివశంకర్, భిక్షపతి, బలరాం, గంగం రాజు, గౌరీశంకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

షాపులోకి దూసుకెళ్లిన కారు

తప్పిన పెను ప్రమాదం



హస్తినాపురం: మద్యం మత్తులో కారును వేగంగా నడుపుకుంటూ వచ్చిన ఓ వ్యక్తి రోడ్డుపై నడిచి వెళ్తున్న వ్యక్తిని తప్పించబోయి షాపులోకి దూసుకెళ్లిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఎన్‌జీఓస్ కాలనీ ప్రధాన రహదారిపై మంగళవారం తెల్లవారు జామున వేగంగా వచ్చిన అదుపుతప్పి ఎదురుగా ఉన్న ఫుట్‌వేర్ షాపులోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారు నడుపుతున్న శ్రీకాంత్‌తోపాటు మరో ముగ్గురు యువకులు మద్యం మత్తులో ఉన్నారని, ప్రమాదం జరిగిన వెంటనే కారును వదిలేసి పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. రోజ్ ఫుట్‌వేర్ షాపు యజమాని మహ్మద్ ఇషాక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారకుడైన శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

'కల్యాణలక్ష్మి, షాదీముబాకర్'లు పేదలకు వరం

పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఉప్పల ఫౌండేషన్ చేయూత: ఉప్పల శ్రీనివాస్‌గుప్తా


పుస్తె, మెట్టెలు, గాజులు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, స్వప్న దంపతులు

నాగోలు: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డల వివాహాలకు కొండంత భరోసా ఇస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్, ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. చంపాపేటకు చెందిన నిఖిత, అచ్చంపేటకు చెందిన స్వాతి, బండ్లగూడకు చెందిన శ్రావణి, సిద్దిపేటకు శ్రీలత వివాహాల సందర్భంగా మంగళవారం ఉప్పల శ్రీనివాస్‌గుప్తాను కలిశారు. వారికి ఉప్పల ఫౌండేషన్ తరుపున పుస్తె, మెట్టెలు, చీరలు, గాజులను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ... బాల్య వివాహాలను రూపుమాపి, పేదింటి అమ్మాయిల పెళ్లిళ్లకు ఈ పథకాలు ఎంతో అండగా నిలుస్తున్నాయన్నారు. ఆయా పథకాలకు రోజు రోజుకూ ప్రజాదరణ పెరుగుతోందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలవుతూ దేశానికే మార్గదర్శిగా తయారయ్యాయన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకానికి అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోసుకొని ఆయా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉప్పల ఫౌండేషన్ కో చైర్ పర్సన్ ఉప్పల స్వప్న, తిరుపతి గుప్తా, సోమ శ్రీనివాస్, శ్రీరాము, వెంకటేశ్, ఆంజనేయులు, సంతోష్, సంపత్, ప్రభాకర్‌గుప్తా, అమ్మాయిల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష

సైదాబాద్: దోపిడీ కేసులో నిందితుడికి న్యాయస్థానం రెండేళ్ల జైలుశిక్ష విధించింది. సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ సుబ్బిరామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ... కుర్మగూడ శ్రీ టెంపుల్ వద్ద నివసించే చీరల శివకుమార్ అలియాస్ లొట్టి (30) తల్లి నిర్వహించే చిన్నపాటి వ్యాపారాల వద్ద సహాయం చేస్తుంటాడు. గత సంవత్సరం ఆగస్టులో ఒక వృద్ధురాలిని దోపిడీ చేసిన కేసులో అతను నిందితుడు. సైదాబాద్ పీఎస్ డీఐ బి.చంద్రమోహన్ కేసు దర్యాప్తు చేసి న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన 7వ ఏసీఎంఎం కోర్టు న్యాయమూర్తి సౌజన్య నిందితుడికి రెండేళ్ల సాధారణ జైలు శిక్ష విధించారని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

మదర్ థెరీసా చారిటబుల్ సొసైటీ సేవలు భేష్


అన్నదానం చేస్తున్న సొసైటీ సభ్యులు

ఎల్‌బీనగర్: మదర్ థెరీసా చారిటబుల్ సొసైటీ సేవలు అమోఘం అని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం శాంతి నిలయ మానసిక వికలాంగుల వసతి గృహంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనం, పండ్లు, స్వీట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చేపూరి శంకరయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు సునీత, మక్బూల్, పవన్, రాజేష్, శివారెడ్డి, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ కాలనీలుగా తీర్చిదిద్దుతా

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలను అన్నివిధాలా అభివృద్ధి చేసి మోడల్ కాలనీలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలో జరుగున్న సీసీ రోడ్డు పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... త్వరగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. త్వరలో అన్ని కాలనీలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ డీఈ దామోదర్‌రావు, ఏఈ రాకేష్, వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రీవెన్నల, కాలనీ నేతలు వెంకటరెడ్డి, నెట్టు కృష్ణ, సయ్యద్, లక్ష్మారెడ్డి, నాయకులు శంకరయ్యగౌడ్, నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పవన్‌రెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

'పరీక్షా పే చర్చ' నిర్వహణకు పురస్కారం


బండి సంజయ్ నుంచి పురస్కారాన్ని అందుకున్న వీరేంద్రబాబు యాదవ్

సైదాబాద్: విద్యార్థులతో ప్రధాని నరేంద్ర మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇటీవల నిర్వహించిన పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని యాకత్‌పురా నియోజకవర్గంలో అత్యుత్తమంగా నిర్వహించిన పార్టీ నియోజకవర్గ శ్రేణులను బీజేపీ రాష్ట్ర నాయకత్వం గుర్తించింది. గత నెల 27న యాకత్‌పురా నియోజకవర్గం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని వినయ్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్ ఆధ్వర్యంలో పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 15 పాఠశాలల నుంచి 800 మంది విద్యార్థులు ప్రధానితో పరీక్షా పే చర్చాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా డ్రాయింగ్ పోటీల్లోనూ పాల్గొన్నారు. వీరేంద్రబాబు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉత్తమ ప్రదర్శనగా పార్టీ గుర్తించింది. మంగళవారం వేద కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేతుల మీదుగా కార్యక్రమ నిర్వాహకుడు వీరేంద్రబాబు యాదవ్ పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఎస్‌సదన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పార్టీ కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామన్నారు. ప్రధానితో విద్యార్థుల కార్యక్రమాన్ని నిర్వహించడంలో తమను ఉత్తమంగా గుర్తించినందుకు ఆయన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

రమాబాయి అంబేడ్కర్ సేవలో చిరస్మరణీయం


రమాబాయికి నివాళులర్పిస్తున్న బీఎస్పీ నేతలు

ఎల్‌బీనగర్: రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి అంబేడ్కర్ త్యాగం మరువలేనిదని బీఎస్పీ ఎల్‌బీనగర్ ఇంచార్జి జక్కా యాదగిరి అన్నారు. రమాదేవి జయంతి సందర్భంగా మంగళవారం బీఎస్పీ కార్యదర్శి కట్ల కుమార్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ నేతలు దాసరి వినయ్, కొమ్ము పవన్, సత్యం, శ్రీను, రాజ్‌కుమార్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీసీ చైర్మన్ పదవిని రజకులకు కేటాయించాలి

మన రజక సంఘం గ్రేటర్ అధ్యక్షుడు బ్రహ్మయ్య


నిరసన వ్యక్తం చేస్తున్న బ్రహ్మయ్య తదితరులు

నాగోలు: ఎంబీసీ చైర్మన్ పదవిని రజకులకు కేటాయించాలని మన రజక సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు పెద్దపూరే బ్రహ్మయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం నాగోలు సాయినగర్ డివిజన్‌లో రజకుల సమ్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ... రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే అంశాన్ని అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని డిమాండ్ చేశారు. రజకులకు రూ. 500 కోట్లు నిధులు కేటాయించి బ్యాంకులతో సంబంధం లేకుండా రుణాలు ఇవ్వాన్నారు. రజక ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసి చైర్మన్‌ను నియమించాలని, ప్రైవేటు కార్యాలయాల్లో ధోబీ పోస్టులను రజకులకు కేటాయించాలని కోరారు. వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొట్టున ప్రతిష్ఠించాలని, జనాభా దామాషా ప్రకారం వచ్చే (అసెంబ్లీ పార్లమెంట్) ఎన్నికల్లో సీట్లు రజకులకు కేటాయించాలని కోరారు. రజకుల సమస్యలు వెంటనే పర్కిరించాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. గ్రేటర్ హైదరాబాద్ యూత్ అధ్యక్షుడు పగడాల లక్ష్మణ్, సంఘం యూత్ ఉపాధ్యక్షుడు పగిళ్ల వెంకటేష్, నాయకులు వి.వడివేలు, వెలిజాల తిరుపతయ్య, గుండన్నరం చంద్రశేఖర్, బాలస్వామి, వెంకటేష్, సతీష్, సురేష్, స్వామి, నవీన్, రాజగోపాల్, శ్రీను, దేవాన్ష్, ఆనంద్, అభిలాష్, మల్లేష్, గణేష్, చంటి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా ప్రత్యంగిరాదేవి బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో ప్రత్యంగిరా అమ్మవారు


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠ విభాగ ఆది పరాశక్తి శ్రీ ప్రత్యంగిరా ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారు ప్రత్యేక కుంకుమ అలంకారంలో దర్శనమిచ్చారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహానక్షత్ర హారతి, యాగ మండప దేవాతా హోమాలు నిర్వహించారు. మహిళలచే ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతులు శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి 'వర్చువల్' ద్వారా అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి మాట్లాడుతూ... భారతీయ సంస్కృతిని, సంప్రదాయలను కాపాడుకోవాలని బాధ్యత అందరిపై ఉందన్నారు. అత్యంత ప్రాచీన, అతి శక్తిమంతమైన శ్రీప్రత్యంగిరా పరమేశ్వరీ ఆదిపరాశక్తి ప్రత్యేక రూపమని తెలిపారు. అమ్మవారి పూజించిన సాధకులకు, శత్రువులు ఎంతటి ప్రయోగం చేసినా నివారించడమే కాక తిరిగి శత్రువు పైకి పంపించే శక్తి అమ్మవారికి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్, మాచవోలు రమేష్ శర్మ, విట్టల్ శర్మ, సాయి కుమార్ శర్మ, గోపాలకష్ణ, రామశర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నాభిషేకం సాయంత్రం పల్లకి సేవ...

అమ్మవారికి బుధవారం ఉదయం 10 గంటలకు అన్నాభిషేకం, సాయంత్రం 6 గంటలకు అమ్మవారి పల్లకీ సేవ ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేశామన్నారు.

కొత్త స్తంభాలను ఏర్పాటు చేయండి


భరత్‌నగర్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాత విద్యుత్ స్తంభాలు తీసి కొత్తవాటని ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. మంగళవారం కొత్తపేట డివిజన్ భరత్ నగర్ ఫేస్ టులో కాలనీవాసులతో కలసి పర్యటించారు. భరత్‌నగర్ కాలనీవాసులకు ఇబ్బందికరంగా వర్షాలు వచ్చినపుడల్లా విద్యుత్ స్తంభాలకు అర్తింగ్ వస్తున్నాయన్నారు. కరెంటు స్తంభాలకు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని కాలనీవాసులు కార్పొరేటర్‌కు వివరించారు. వెంటనే సంబంధిత విద్యుత్ ఏఈని అక్కడికి పిలిపించి బస్తీలో విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. భరత్‌నగర్ కాలనీలో స్తంభాలకు ఉన్న తీగలను ఇండ్లకు తగలకుండా ఉండేందుకు తగు ఏర్పాట్లు చేయాలని, పాత స్తంభాలు తీసి కొత్తవాటిని ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు సుందర్‌నారాయణ, స్వామి, కొత్త తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

గుండాల విజయకుమార్‌కు కబీర్ కోహినూర్ అవార్డు


విజయకుమార్‌కు అవార్డును అందజేస్తున్న నిర్వాహకులు

వనస్థలిపురం: తెలంగాణ హిందీ కవి, వనస్థలిపురంకు చెందిన గుండాల విజయకుమార్‌కు కబీర్ కోహినూర్ అవార్డు లభించింది. హిందీ సాహిత్యంలో విశేష ప్రతిభకు గానూ ఈ పురస్కారం దక్కింది. దేశం మొత్తంగా అన్ని రాష్ట్రాల నుంచి 100 మందికి పైగా ఈ అవార్డుకు ఎంపిక చేయగా తెలంగాణ ప్రాంతం నుంచి విజయకుమార్‌కు ఈ అవకాశం దక్కింది. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కబీర్‌దాస్ సంస్థ వ్యవస్థాపకుడు భరత్‌భూషణ్ మహంతి, డాక్టర్ నానక్‌దాస్ మహారాజ్, బలక్ నాయజి మహారాజ్, విశ్వ శాంతి దూత ఆచార్య డాక్టర్ లోకేష్ ముని జీ మహారాజ్‌లు అవార్డును అందజేశారు.

అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం అవసరం


గోకుల్‌ఎన్‌క్లేవ్ కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులలో ప్రజలు భాగస్వాములు కావాలని ప్రజల భాగస్వామ్యంతోనే ఆయా పనులు నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తవుతాయని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. గోకుల్‌ఎన్‌క్లేవ్ కాలనీలో కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ సుజాతానాయక్ మార్నింగ్ వాక్‌చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... రోజురోజుకూ పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మెరుగైన వసతులను కల్పిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సహకారంతో టీఎన్ఆర్ అపార్ట్‌మెంటు పక్క నుంచి డ్రైనేజీ లైన్ నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కాయితి జగన్‌మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌రావు, స్వాతి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేట ఏసీపీకి సన్మానం


ఏసీపీ శ్యామ్‌సుందర్‌ను సన్మానిస్తున్న బీఎస్పీ నాయకులు

మలక్‌పేట: మలక్‌పేట ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన శ్యామ్‌సుందర్‌ను బీఎస్పీ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి అలుగోల రమేష్, నియోజకవర్గ అధ్యక్షుడు ఆడపు లక్ష్మణ్, కోశాధికారి నరేందర్‌నాయక్, యాకత్‌పురా ఇన్‌చార్జి నిమ్మ రాజ్‌కుమార్ బీఎస్‌పీ నాయకులు ఏసీపీని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

పీస్ కమిటీ ఆధ్వర్యంలో...


సన్మానిస్తున్న పీస్ కమిటీ సభ్యులు

చాదర్‌ఘాట్: మలక్‌పేట ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన జి.శ్యాంసుందర్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు, సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సన్మానించారు. ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తదితరులు ఏసీపీకి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నేతలు చౌకి రవికుమార్, ఈస్ట్ జోన్ పీస్ కమిటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, కార్యదర్శి మజారుద్దీన్, వేముల విజయ్‌కుమార్, మదన్‌బాబు, ఇంతియాజ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్‌పేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషా హాలోని కార్యాలయంలో మంగళవారం అంబర్‌పేట మండల పరిధిలోని శంకర్‌నగర్, పద్మానగర్, వాహేద్‌నగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ, ఓల్డ్‌మలక్‌పేట, పల్టాన్, అక్బర్‌బాగ్, కాలడేరా కాలనీ, కమల్‌నగర్, మూసానగర్, అజంపురాకు చెందిన 32 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన నిధులకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఆర్ఐ శ్రీకాంత్, మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల